క్లుప్తంగా

హుండీ లెక్కింపు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చీదెళ్లలో నిర్వహించిన శ్రీలక్ష్మీతిరుపతమ్మగోపయ్య స్వాముల జాతర హుండీ లెక్కింపు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి, మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి మాట్లాడుతూ.. జాతర సందర్భంగా రూ.2లక్షల 73వేల740లు హుండీ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, సైదులు, గొట్టిపర్తి గోవిందు, పిచ్చయ్య, అనంతుల ఆంజనేయులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా కొండల్‌రెడ్డి


కొండల్‌రెడ్డి

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల కేంద్రానికి చెందిన సంకెపల్లి కొండల్‌రెడ్డిని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ శుక్రవారం వెల్లడించారు. అనంతరం కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

రెండు ఉద్యోగాలకు ఎంపికైన ఫణిగిరి యువతి


బోడ సంధ్య

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గురుకుల ఫలితాల్లో మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన బోడ సంధ్య ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. 2023 ఆగస్టులో పీజీటీ, జేఎల్(జూనియర్ లెక్చరర్) గురుకుల పరీక్ష రాసింది. కాగా ఆమె గురుకుల బోర్డు ప్రకటించిన ఫలితాల్లో పీజీటీ, జేఎల్(గణితం) విభాగంలో ఎంపికై ఉద్యోగం సాధించింది. ఈ సందర్భంగా సంధ్యను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా గుంజాలోర్ దర్గా ఉర్సు


ఉర్సులో పాల్గొన్న ముస్లింలు, గ్రామస్తులు

చివ్వెంల(సూర్యాపేట) : మండలంలోని గుంజలూరు గ్రామంలో శుక్రవారం జాన్‌పహాడ్ గుంజాలోర్ దర్గా ఉర్సు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గంధం ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ప్రతి సంవత్సరం జరిగే ఈ ఉర్సులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముజావర్లు జానిమియా, ఖాదర్ఖాన్, సులేమాన్ ఖాన్, అజీమ్, అయూబ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి


అమరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలగిరి(తుంగతుర్తి) : ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కందుకూరి సోమన్న కోరారు. శుక్రవారం పట్టణంలో గాంధీభవన్ దాడి ఘటనలో గాయపడి మృతి చెందిన సురేందర్ మాదిగ, దామోదర్, భారతి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రశాంత్, విష్ణు, నర్సింహానాయుడు, సోమేష్, ప్రవీణ్, రామ్మూర్తి, గోపిచంద్, నాగరాజు, సాయి, కిరణ్, నాని, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

3,732గృహాలకు గృహజ్యోతి పథకం వర్తింపు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో 3,732 గృహాలకు గృహజ్యోతి పథకం వర్తించిందని మండల విద్యుత్ ఏఈ వాస శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం అర్వపల్లిలో వినియోగదారుల ఇళ్లకు వెళ్లి మీటర్ రీడింగ్ తీసి గృహజ్యోతి పథకం వర్తించిన వారికి జీరో బిల్లులను అందజేసి మాట్లాడారు. గృహజ్యోతి పథకం వర్తించని వారు రేషన్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు నంబర్, ఆధార్‌కార్డు నంబర్లను ఎంపీడీఓ కార్యాలయంలో అందించి ధృవీకరణ పత్రాన్ని స్థానిక విద్యుత్ కార్యాలయంలో అందించాలన్నారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ గిరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, మూసీ ప్రాజెక్టు మత్స్య కార్మిక సంఘం మాజీ చైర్మన్ అలువాల వెంకటస్వామి, లైన్‌మెన్ పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూలో చేరిక

మద్దిరాల : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు శుక్రవారం మండల కేంద్రంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామల్ల నవీన్ ఆధ్వర్యంలో ఆ సంఘంలో చేరారు. దీంతో వారికి ఆయన సంఘం కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మధు, యాదగిరి, కామల్ల శ్రీను, నాగెల్లి రామనర్సయ్య, ఉపేందర్, భిక్షం, కిరణ్, సోమయ్య పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం సాగేదెలా

- కంకర తేలి అధ్వానంగా మారిన గ్రామాలకు వెళ్లే రహదారులు
- ప్రమాదాల బారినపడుతున్న వాహనదారులు, ప్రయాణికులు


తిరుమలగిరి నుంచి తాటిపాములకు వెళ్లే మార్గంలో కంకర తేలి ఉన్న రహదారి


కంకర తేలిన వెలిశాల - బండ్లపల్లి వెళ్లే రోడ్డు

తిరుమలగిరి(తుంగతుర్తి) : గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రజలు నరకం చూస్తున్నారు. ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణం సాఫీగా సాగాలంటే రహదారులే కీలకం. అలాంటి రోడ్లు కంకర తేలి అధ్వానంగా ఉంటే నరక ప్రాయమే. ఓ వైపు కంకర తేలి, మరో వైపు గుంతలు పడిన రోడ్లతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. తిరుమలగిరి మండలంలో తిరుమలగిరి నుంచి తాటిపాములకు వెళ్లే రహదారి సుమారు 5కిలోమీటర్ల మేర, వెలిశాల ఎక్స్‌రోడ్డు నుంచి వెలిశాల గ్రామం వరకు, వెలిశాల నుంచి బండ్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామాలకు వెళ్లే రోడ్లలో కంకర తేలడంతో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. సంవత్సరాలు గడుస్తున్నా రహదారులకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారులపై కంకర తేలి ఉండటంతో రాత్రివేళల్లో అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. తిరుమలగిరి నుంచి తాటిపాములకు వెళ్లే రహదారి తీవ్రంగా దెబ్బతినడంతో మొండ్రాయి నుంచి తిరుమలగిరి రావాల్సి వస్తుండంతో అదనంగా 5కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సివస్తుంది. ఈ రహదారులపై ప్రతినిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కంకర రోడ్లను బీటీ రోడ్లుగా మార్చి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కంకర రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలి

తిరుమలగిరి నుంచి తాటిపాములకు వెళ్లే దారి కంకర తేలి ఉండటంతో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కంకర తేలి పలుచోట్ల గుంతలు ఏర్పడడంతో రాత్రి సమయాల్లో ప్రయాణం చేయాలంటే అవస్థలు పడాల్సివస్తుంది. అధికారులు స్పందించి కంకరరోడ్డును బీటీరోడ్డుగా మార్చి సమస్యను పరిష్కరించాలి.

– కృష్ణ, తాటిపాముల

ప్రతిపాదనలు పంపించాం



మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో కంకర తేలి పూర్తిగా దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. పలు గ్రామాలకు వెళ్లే రోడ్లకు నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించి సమస్యను పరిష్కారానికి కృషి చేస్తాం.

– రవికుమార్, పీఆర్ ఏఈ, తిరుమలగిరి

వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ప్రజలు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బీఎస్ రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలో వివేకానంద వృద్ధాశ్రమంలోని వృద్ధులు, హైదరాబాద్ కాకతీయ స్కూల్ విద్యార్థులు, పాలిటెక్నిక్ మహిళా కళాశాల విద్యార్థులు, బధిరుల పాఠశాల విద్యార్థులు, ఎస్వీ కళాశాల సిబ్బంది, పరిసర ప్రాంత ప్రజలు పాల్గొని కార్డియాలజీ, ఆర్థోపెడియాట్రిక్, గైనకాలజిస్ట్ పరీక్షలు చేయించుకున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.మాధవి, సీనియర్ గైనకాలజిస్ట్ రోషన్‌కుమార్ జైస్వాల్, డాక్టర్ పి.ప్రణీత్, డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ విజయ వర్ధన్‌రావు, నిఖిలారెడ్డి, డైరెక్టర్ కిరణ్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ ముత్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెంపు


రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

తుంగతుర్తి: ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డి.నరేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని రావులపల్లి ఎక్స్‌రోడ్డు తండాలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. పంట పొలాల్లో ఎరువులు, క్రిమిసంహారక మందులు అధికంగా వినియోగిస్తే భూసారం దెబ్బతిని, ఖర్చుపెరిగి దిగుబడి కూడా తగ్గుతుందన్నారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయల పెంపకం, వేసవిలో వేసుకోవాల్సిన పంటలు గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేవికే శాస్త్రవేత్త డి.ఆదర్శ్, ఉద్యాన అధికారి స్రవంతి, శ్రీజన, కిరణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న తండావాసులు

సూర్యాపేట రూరల్ : అంగన్‌వాడీ టీచర్ నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని మండలంలోని జాటోత్‌తండా గ్రామ ప్రజలు శుక్రవారం తండాలో ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ భూ ఆక్రమణలకు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని ఎలాగైనా ఉన్నతాధికారులు తండాలోని 187 సర్వే నంబర్‌లో గల రెండు గుంటల భూమిని అంగన్‌వాడీ టీచర్ బానోత్ కమలాబాయి ఆక్రమిస్తున్నారని అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం పాఠశాల నిర్మాణం చేస్తామంటే ఇటీవల కాలంలో ఆ భూమిని కాజేయాలని చూస్తున్నారన్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా నిర్మాణాలు ఎలా చేస్తారని నిలదీయడంతో మాపై గొడవకు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 20సంవత్సరాల నుంచి అందులో పిల్లలు ఆటలు ఆడుకుంటున్నారని రాత్రికిరాత్రే అందులో నిర్మాణం చేపడుతున్నారని, ఈ విషయంపై ఉన్నతాధికారులు, రెవెన్యూ, పోలీస్ సిబ్బందికి విన్నవించినా పట్టించుకోకుండా వదిలేస్తున్నారే తప్ప టీచర్‌పై చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు కలుగజేసుకొని అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. ఆందోళనలో ధరావత్ వీరన్న, నరేందర్, నాగు, కార్తీక్, కిరణ్, మౌథా, సురేందర్, లింగ, చక్రనాయక్, బిక్కు, సైదులు, సంతోష్, కిరణ్, రాకేష్, ఉత్తేజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పేరుతో రూ.కోట్లు దోచుకున్నారు

- ఎమ్మెల్యే మందుల సామేల్


నాగారం : ఆత్మీయ అభినందన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్రాజెక్టుల పేరు చెప్పి బీఆర్ఎస్ నాయకులు కోట్ల రూపాయలు దోచారని, మేడిగడ్డ ప్రాజెక్టుకు ఎందుకు వెళ్లారో కేటీఆర్ సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టులపై కేటీఆర్, హరీష్‌రావులపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, మేడిగడ్డకు వెళ్లే ముందు మాజీ సీఎం కేసీఆర్‌ను అడిగితే బాగుండేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రావడం కష్టమేనని అన్నారు. ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ చెల్లాచెదురవుతుందని జోస్యం చెప్పారు. తిరుమలగిరి మండలంలో దళిత బంధు ప్రాజెక్టులో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, దళితుల పైసలన్నీ దళారుల పాలయ్యాయని విమర్శించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, జమ్మిలాల్, పేరాల వీరేష్, సుంకరి జనార్దన్, బత్తుల శ్రీను, లక్ష్మయ్య, రాపాక సోమేష్, రాము గౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

నాగారం : విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఫణిగిరిలో నియోజకవర్గ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. నియోజకవర్గంలో విద్యార్థులకు ఉన్నత విద్య అందించేందుకు తిరుమలగిరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోత్కూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయించానని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 50మంది విద్యార్థులను తాను చదివిస్తానని ప్రకటించారు. వెలుగుపల్లిలోని రుద్రమ చెరువును రిజర్వాయర్‌గా మార్చడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో రవీందర్, ఎంపీడీఓ జి.శోభారాణి, ఎంఈఓ బి.బాలునాయక్, ఎస్సీ, ఎస్టీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొంపెల్లి భిక్షం, జానకిరాములు, రామ్మోహన్, కనకసేన, కడారి సతీష్, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

డీఈఈపై చర్యలు తీసుకోవాలని వినతి


తిరుమలగిరి (తుంగతుర్తి) : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

జర్నలిస్టులను దూషించిన ఇరిగేషన్ డీఈఈ పిచ్చయ్యపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మండల పరిధిలోని ఫణిగిరిలో ఎమ్మెల్యే మందుల సామేల్‌కు మండల జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై విచారణ చేసి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు. వినతి ఇచ్చిన వారిలో డి.లక్ష్మణ్, ఎల్మకంటి నరేష్, వంగూరి అంజయ్య, అందె జానీ, పోర్ల మహేందర్, నీరటి జోసెఫ్, నర్సింహ, అంజనేయులు తదితరులు ఉన్నారు.

తాగు, సాగునీటి సమస్య పరిష్కరించాలి


మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

పెన్‌పహాడ్ : మండలంలో తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాగర్ ఎడమకాలువ ద్వారా సాగు నీటిని విడుదల చేయకపోవడంతో మండలంలోని ఆయకట్టులో సాగు చేసిన వరిపంట నీరు లేక ఎండిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి నెల ప్రారంభంలోనే ఎండలు తీవ్రంగా ఉన్నాయని, చాలా గ్రామాల్లో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా ఆగిపోవడంతో గ్రామాల్లో చేతి పంపులు పనిచేయక వ్యవసాయ బావుల నుంచి బిందెలతో నీటిని తెచ్చుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. పేదలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం అర్హులైన వారందరికీ ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డులు అడుగుతున్నారని అర్హులందరికీ రేషన్‌కార్డులు అందజేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, ధనియాకుల శ్రీకాంత్ వర్మ, వీరబోయిన రవి, మడ్డి అంజిబాబు, గుంజ వెంకటేశ్వర్లు, గుర్రం గోపాల్‌రెడ్డి, బొమ్మిరెడ్డి గోపిరెడ్డి, నెమ్మాది లక్ష్మి, ఇరుగు రమేష్, నెమ్మాది పీరయ్య, నకిరేకంటి భిక్షం పాల్గొన్నారు.

పల్స్‌పోలియో కార్యక్రమంపై అవగాహన ర్యాలీ


తుంగతుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది


నూతనకల్‌లో..

పెన్‌పహాడ్ : ఈ నెల 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి స్రవంతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 5ఏళ్లలోపు చిన్నారులకు ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ అనంతలక్ష్మి, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, హెచ్‌ఈఓలు చంద్రశేఖర రాజు, శ్రీనివాస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తుంగతుర్తి : పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ నిర్మల్‌కుమార్ కోరారు. ఈనెల 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమంపై శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. 0–5 పిల్లలందరికి తల్లిదండ్రులు విధిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. తుంగతుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 4రూట్లలో 36 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ సముద్రాల సూరి, రవికుమార్, సురేష్, సైదమ్మ, జానకమ్మ, నవీన్, వేణుగోపాల్, యాదగిరి, నర్సింహాచారి, సోమన్న, రజిత, నాలగక్ష్మి, స్వాతి, జయమ్మ పాల్గొన్నారు.

నూతనకల్ : ఈనెల 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని మండల వైద్యాధికారి అశ్రితారెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో పల్స్‌పోలియోపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం


తాళిబొట్టు చూపుతున్న వేద పండితులు

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామశివారులోని గిరిదుర్గంలో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీమాన్ రవికుమారచార్యులు, శ్రీమాన్ క్రిష్ణమాచార్యులు మంత్రోచ్చరణతో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో స్వామి వారికి వైభవంగా కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం కృష్ణకుమార్, బందకవి కృష్ణమోహన్, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న లింగయ్య

నాగారం : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ పనిచేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పసునూర్‌లో ఎమ్మెల్యే నిధులు రూ.30లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఏగూరి మంజుల, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పంది శ్రీనివాస్, మామిడి సోమయ్య, పొదిల నరేష్, చిత్తలూరి వెంకటయ్య, కమటం శ్రీనివాస్, రామరత్నం, వెంకన్న, నాగయ్య,రవీందర్, శ్రీనివాస్, దుర్గయ్య, నాగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి హనుమంతసేవ


హనుమంతసేవ ఊరేగింపులో అర్చకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లోభాగంగా గరువారం అర్ధరాత్రి హనుమంత సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంత వాహనంపై నర్సింహస్వామి, అమ్మవార్లు శ్రీదేవి, భూదేవిలుగా కొలువుదీరారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు ఇంటింటికి హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఉత్సవానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, ధర్మకర్తలు జేరుపోతుల సోమయ్య, దిర్శనపు కృష్ణమూర్తి, కనుకు రేణుక, లక్ష్మాజీ, మాజీ జెడ్పీటీసీ కొరపిడత అవిలయ్య, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరిరావు

నూతనకల్ : వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ అనుసరిస్తున్న కార్మిక రైతు ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని, రైతులు చేస్తున్న న్యాయపోరాటాన్ని గుర్తించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, గాజుల జానయ్య, సామ సురేందర్‌రెడ్డి, తొట్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


అర్వపల్లి : విద్యార్థులతో ఉపాధ్యాయులు


మద్దిరాల : పోలుమల్ల పాఠశాలలో..

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డీఈఓగా శివకార్తీక్, ఎంఈఓగా మహేష్, హెచ్ఎంగా అజయ్‌కుమార్, ఉపాధ్యాయులుగా శైనీ, సాత్విక్, మల్లేష్, అంజలి, తనీష్, హర్షవర్ధన్ విధులు నిర్వర్తించారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి హెచ్ఎం టి.కరుణాకర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఎస్.కరుణ, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల పరిధిలోని పోలుమల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో చూపరులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు బయ్యా దేవేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

సూర్యాపేటరూరల్ : రైతులు తమ భూమి సమస్యలు ఉంటే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ధరణి స్పెషల్ డ్రైవ్‌లో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నుంచి 9వ తేదీ వరకు భూ సమస్యల ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ భూ సమస్యలతో వచ్చిన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడలు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం నుంచి ఈనెల 4వరకు తెలంగాణ రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించన్నారు. క్రీడల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.30వేలు, రెండో బహుమతి రూ.25వేలు, మూడో బహుమతి రూ.20వేలు, నాలుగో బహుమతి రూ.15వేలు, ఐదో బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.500ఎంట్రీ ఫీజు చెల్లించాలని నిర్వాహకులు వెల్లడించారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు 7995237720, 8074373955, 8919322760, 8555925749కు సంప్రదించాలని కోరారు. ఇదిలా ఉండగా దేవాలయం ఎదుట కబడ్డీ పోటీల నిర్వహణకు మైదానాన్ని శుక్రవారం సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఈద కోటిప్రసాద్, మేడి సంపత్, సాయిని మనోహర్, బి.వేణుగోపాల్, శ్రీకాంత్, నాగరాజు, సిద్ధార్థ, మహేష్, శివ, రాజు ఉన్నారు.

మహాసభల కరపత్రాలు విడుదల


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నూతనకల్ : సూర్యాపేటలో ఈనెల 10న నిర్వహించే బహుజన సంఘం రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు కె.పర్వతాలు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బహుజన నాయకులు మాంద్ర మల్లయ్య యాదవ్, బత్తుల వెంకన్న, వెంకట్‌యాదవ్, కంబాలపల్లి శ్రీనివాస్, వెంకయ్య, ములకలపల్లి సైదులు, వెంకటేశ్వర్లు, అమృతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

నూతనకల్ : ధరణి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మూరగుండ్ల లక్ష్మయ్య, జిల్లా కమిటీ సభ్యుడు తొట్ల ప్రభాకర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో కలిసి వారు మాట్లాడారు. ఎన్నో సంవత్సరాలుగా సీలింగ్ భూములను కొనుగోలు చేసిన రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని పలు ఉద్యమాలు చేసినప్పటికీ ఫలితం లేదని నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో భూ సమస్యలు పరిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.